క్లుప్తంగా

ముగిసిన ఎరకమ్మ జాతర



చింతపల్లిలో జాతర సందడి

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లి ఎరకమ్మ జాతర శనివారంతో ముగిసింది. అమ్మవారిని వేలాది మంది భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న నృత్య రూపకం



విద్యార్థులు ప్రదర్శిస్తున్న నృత్య రూపకం

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన రామనారాయణంలో త్రివేణి నృత్య కళా డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ హారిక ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆహూతులను అలరించింది. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వాహకులు ధ్రువపత్రాలు అందజేశారు.

సీఎం బస్సుయాత్రకు ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని పాతకొప్పెర్ల సమీపంలో జాతీయ రహదారిపై ఈనెల 23వ తేదీ సాయంత్రం 4 గంటలకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించనున్న సిద్ధం బస్సుయాత్రకు సంబంధించిన ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, తదితరులు శనివారం సాయంత్రం పరిశీలించారు. సభకు ఎంతమంది హాజరుకావచ్చు.. వాహనాల పార్కింగ్.. ట్రాఫిక్ మొదలగు అంశాలపై చర్చించి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులోని స్థలాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్. సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధిలు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, లంకలపల్లి రాజారావు, బొల్లు రమేష్, కోట్ల రఘు, బావిశెట్టి నారాయణరావు, కొత్తకోట శ్రీరాములు, పతివాడ సూరిబాబు, జనపాల అప్పారావు, తదితరులు ఉన్నారు.

టీడీపీ రెబల్ అభ్యర్థి ప్రచారం

విజయనగరం రూరల్: విజయనగరం నియోజకవర్గ టీడీపీ రెబల్ అభ్యర్థి మీసాల గీత నగరంలో శనివారం విస్తృతం ప్రచారం నిర్వహించారు. తన మద్దతుదారులతో కార్పొరేషన్ పరిధిలోని మూడు లాంతర్లు, మెయిన్ రోడ్డు ఏరియాలో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సైలాడ త్రినాథ్, జెడ్పీటీసీ సభ్యుడు తుంపిల్లి రమణ, పార్టీ నాయకుడు రవిరాజు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం నేడు

నెల్లిమర్ల: మండలంలోని జరజాపుపేటలో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సాధన యువజన సంఘ అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు రోగులను పరీక్షించి, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. రోగులు ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, బ్యాంక్ పుస్తకం తీసుకురావాలని కోరారు.

వాహన తనిఖీలు

దత్తిరాజేరు: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కోమటిపల్లి జాతీయరహదారి -26 వద్ద పోలీసులు, ఎంపీడీఓ కార్యాలయ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద శనివారం ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. చెక్ పోస్ట్ అధికారులు ప్రసాదరావు, నాగేశ్వరరావు ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాల్లో రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్లినా, అధిక మొత్తంలో వస్తు, సామగ్రిని తరలించినా తగిన రసీదులు,బిల్లులు ఉండాలన్నారు. ఆధారాలు లేకుంటే నగదు, వస్తు, సామగ్రిని స్వాధీనం చేసుకుంటామని, ఎన్నికల కోడ్‌ను పాటించాలని సూచించారు.

ఆరుగురిపై బైండోవర్ కేసులు

బొండపల్లి: అక్రమంగా మద్యం విక్రయిస్తూ పలుమార్లు పట్టుబడిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని తహసీల్దార్ ఎస్.హనుమంతురావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎస్‌ఈబీ ఎస్‌ఐ ఆర్.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని పలుగ్రామాలకు చెందిన ఆరుగురు వ్యక్తులపై సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బైండోవర్ కేసులు నమోదు చేశారు. వీరంతా గతంలో పలుమార్లు మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డారని, వీరిపై నిరంతర నిఘా ఉంటుందని తహసీల్దార్ తెలిపారు.

ఘనంగా శ్యామలాంబ విగ్రహ ప్రతిష్ఠ

గుర్ల: మండలంలోని కోటగండ్రేడు గ్రామ దేవత శ్యామలాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు శనివారం ఘనంగా చేపట్టారు. యాగశాలలో ప్రత్యేక హోమాలు చేపట్టారు. అమ్మవారి విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

జలం.. పుష్కలం...

- చంపావతి, గోస్తనీ, రామతీర్థం ప్రాజెక్టుల ద్వారా నియోజకవర్గ ప్రజలకు తాగునీరు సరఫరా
- రూ. 37.5 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న నియోజకవర్గ ప్రజలు



పూసపాటిరేగలో ఏర్పాటు చేసిన చంపావతి ప్రాజెక్ట్ స్టోరేజీ పాయింట్

జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు చేసిన ఖర్చు

మండలం	గ్రామాలు	గృహాలు	నిధులు (రూ. కోట్లల్లో)
పూసపాటిరేగ	73	18,165	రూ.10.5 కోట్లు
నెల్లిమర్ల	51	14,676	8.5 కోట్లు
డెంకాడ	76	14,113	8 కోట్లు
భోగాపురం	85	15,075	రూ. 10.5 కోట్లు



మంచినీటి ట్యాంక్

పూసపాటిరేగ: గొంతు తడుపుకోవడానికి కిలోమీటర్ల దూరం వెళ్లి చెరువులు, బావులు, బోర్ల నుంచి బిందెడు నీరు తెచ్చుకునే పరిస్థితుల నుంచి ఇంటి వద్దే నీరు పట్టుకునే స్థితికి నియోజకవర్గ ప్రజలు చేరుకున్నారు. ఏళ్ల తరబడి నియోజకవర్గ ప్రజలు తాగునీటికి ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అయితే ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో నియోజకవర్గానికి తాగునీటి ప్రాజెక్టులు మంజూరు చేశారు. ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూ. 37.5 కోట్లు మంజూరు చేశారు. పూసపాటిరేగ మండలానికి చంపావతి ప్రాజెక్ట్.. డెంకాడ, భోగాపురం మండలాలకు చంపావతి, గోస్తనీ ప్రాజెక్టులు.. నెల్లిమర్ల మండలానికి రామతీర్థం, గుర్ల ప్రాజెక్టుల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామాల ప్రజలు తాగునీటికి నానా అవస్థలు పడేవారు. బిందెడు నీటికోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సివచ్చేది. ప్రస్తుతం జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయిలు వేస్తున్నారు. ప్రస్తుతానికి చాలావరకు పనులు పూర్తయ్యాయి. నెల్లిమర్ల నియోజకవర్గంలో పూసపాటిరేగ, డెంకాడ, నెల్లిమర్ల, భోగాపురం మండలాల పరిధిలో 285 గ్రామాలకు గాను రూ. 37.5 కోట్లతో 62,029 గృహాలకు కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ పనులు చేపట్టడంతో ఎంతోకాలంగా తాగునీటికి ఎన్నో కష్టాలు పడిన ప్రజలకు ఊరట ఇచ్చినట్టైంది. అలాగే సుమారు 20 కోట్ల రుపాయలతో చంపావతి, గోస్తనీ, రామతీర్థం, గుర్ల ప్రాజెక్టులు ఏర్పాటు చేసి నియోజకవర్గ ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. తాగునీటి కష్టాలు తీర్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు నియోజకవర్గ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

నీటి కష్టాలు తీరినట్టే..

ఎంతో కాలంగా ఉన్న తాగునీటి కష్టాలు తీరాయి. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చొరవతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటయ్యాయి. వేసవిలో సైతం తాగునీరు పుష్కలంగా అందడం అభినందనీయం.

– ఎం. జనార్దనరావు, పూసపాటిరేగ

రూ. 37.5 కోట్లతో..

నియోజకవర్గంలోని 285 హేబిటేషన్లలో సుమారు 37.5 కోట్ల రూపాయలతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నాం. జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా చేపడుతున్న పనులు చాలావరకు పూర్తయ్యాయి.

– ప్రవీణ్ శంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పూసపాటిరేగ

హామీలన్నీ అమలు చేశాం...



పినతరిమిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స
- గ్రామాల్లో చురుగ్గా ఎన్నికల ప్రచారం

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు అన్నారు. మండలంలోని బొప్పడాం, వల్లూరు, మల్యాడ, గుషిణి పంచాయతీ పరిధి గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...జగనన్న ప్రజల కోసం ఏదైనా హామీ ఇచ్చారంటే తూ. చా. తప్పకుండా అమలు చేస్తారన్న నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు హామీలైతే నీటిమీద రాతలేనని ఎద్దేవా చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేశాం కాబట్టే ధైర్యంగా ఓట్లు అడుగుతున్నామని చెప్పారు. ప్రస్తుతం పేదలు, పెత్తందారుల మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని.. మంచి చేసిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలబడాలని కోరారు.

మోసపోవద్దు..

జనసేన అభ్యర్థి లోకం నాగమాధవి కేవలం రూ.15 విలువ చేసే బకెట్లను ఇంటింటా పంచి ఓట్లు రాబట్టాలని చూస్తోందని ఎమ్మెల్యే బడ్డుకొండ విమర్శించారు. ప్రజల ఆత్మగౌరవాన్ని బకెట్లతో తాకట్టు పెట్టాలనే నీచ సంస్కృతికి తెర తీశారని, ఓటర్లందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరు మంచి చేశారో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సంస్థ పేరిట కోట్లాది రూపాయల విలువ చేసే భూములు కాజేశారని, స్థానికులెవ్వరికీ ఉద్యోగాలు కల్పించలేదని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, మండల అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, సర్పంచ్‌లు అంబళ్ల కిరణ్, పప్పల బలరాం, ఎంపీటీసీ సభ్యులు బొంతు పురుషోత్తం, చనమళ్ల స్వాతి, నాయకులు పంచాది శ్రీరాములనాయుడు, జనాపాల కృష్ణ, బొంతు స్వామినాయుడు, గడి అప్పలనాయుడు, బొంతు చంద్రశేఖర్, పైడి అప్పన్న, అట్టాడ కనకారావు, జమ్ము అప్పలనాయుడు, జమ్ము సత్తిబాబు, చనమళ్ల అప్పలనాయుడు, తులసి, చనమళ్ల గోవింద, మామిడి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి..

పూసపాటిరేగ: స్థానిక పెట్రోల్‌బంక్ సమీపంలోని సర్వీస్ రోడ్డుపై ప్రతి బుధవారం సంత నిర్వహిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపైనే కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని వల్లూరు పంచాయతీకి చెందిన టీడీపీ, జనసేన నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన లెంక సత్యం, షేక్ సోములు, పిన్నింటి సన్యాసి, మల్లపు రెడ్డి శ్రీను, అలుగోలు మల్లేసు, మామిడి రాంబాబు, దేబార్కి తాతారావు, గందవరపు పైడమ్మ, బట్టాన బలరాం, బట్టాన కృష్ణ, తదితర 25 కుటుంబాలు టీడీపీ, జనసేనను వీడి శనివారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరందరికీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. ఓట్ల కోసం టీడీపీ నాయకులు తమను వినియోగించుకున్నారే తప్ప ఎటువంటి సంక్షేమం చేయలేదన్నారు. జగన్ మోహన్‌రెడ్డి హయాంలో ఆర్థిక భరోసా కలిగిందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం అహర్నిశలు శ్రమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, మండల అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీను, నాయకులు పంచాది శ్రీరాములనాయుడు, కంది శ్రీనివాసరావు, సువ్వాడ రమేష్ నాయుడు, పైడి అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవాలి

- వైఎస్సార్‌సీపీ నాయకులు



గుణుపూరులో ప్రచారం చేస్తున్న ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, బడ్డుకొండ మణిదీప్, రొంగలి కనకసింహాచలం, తదితరులు

డెంకాడ: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జోన్-2 జోనల్ ఇన్‌చార్జ్ బడ్డుకొండ మణిదీప్, డెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు అన్నారు. మండలంలోని గుణుపూరులో వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు, విజయనగరం ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్‌లకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కులమతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారని చెప్పారు. అమ్మఒడి పథకం ద్వారా ఆర్థిక చేయూత ఇచ్చారన్నారు. పొదుపు సంఘాల మహిళలకు విడితల వారీగా రుణమాఫీ చేశారని తెలిపారు. మహిళలకు అన్ని రంగాల్లో తగిన ప్రాధాన్యం ఇచ్చిన ఘనత జగనన్నకే దక్కిందని కొనియాడారు. కార్యక్రమంలో డెంకాడ సర్పంచ్ పతివాడ గౌరి, వైఎస్సార్‌సీపీ నాయకులు మండల సత్యం, బడుకొండ రామునాయుడు, పతివాడ కృష్ణవేణి, పొండ్రంకి ఆదినారాయణ, సంచాన కృష్ణమూర్తి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతివ్వండి..

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి




ప్రచారం నిర్వహిస్తున్న కోలగట్ల శ్రావణి, తదితరులు

విజయనగరం రూరల్: వచ్చే నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయనగరం అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధికార ప్రతినిధి డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి కోరారు. రాకోడులో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా వీరభద్రస్వామి అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో సంక్షేమ కార్యక్రమాలు కొనసాగితే.. స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి హయాంలో అభివృద్ధి జోరుగా జరిగిందని చెప్పారు. గ్రామాలలో రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకే పాలన తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను, ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్రస్వామిని మరోసారి గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, సర్పంచ్ పాటిపిరెడ్డి వెంకటరమణ, పార్టీ నాయకులు మహేష్, స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దేశానికి సేవ చేయాలి

- స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా చీఫ్ కమిషనర్ విజయ్‌కుమార్



స్కౌట్‌లో చేరిన విద్యార్థులతో అధికారులు, ఉపాధ్యాయులు

డెంకాడ: స్కౌట్స్ ఉద్యమంలో చేరి దేశానికి సేవ చేయాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా చీఫ్ కమిషనర్ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ఎంఈఓ - 2 రాధాకృష్ణ శనివారం ప్రారంభించారు. హెచ్‌ఎం వీవీఏ నర్సింగరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 32 మంది విద్యార్థులను యూనిట్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత రోజుల్లో ప్రతి విద్యార్థికీ స్కౌట్స్ శిక్షణ అవసరమని తెలిపారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ వాక చిన్నంనాయుడు మాట్లాడుతూ.. స్కౌట్ శిక్షణ పొందడం వల్ల విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ వరిస్తుందని చెప్పారు. ఉపాధ్యాయులు ప్రతి పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో త్రినాథనాయుడు, ప్రవీణ్‌కుమార్, సూరిబాబు, ఎల్. దుర్గానాగేశ్వరరావు, సౌభాగ్యలక్ష్మి, శాంతిస్వరూప్, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోలాహలంగా కోలగట్ల నామినేషన్

- పైడితల్లి, కోట సత్తెమ్మ తల్లికి పూజలు చేసిన కోలగట్ల



కోలగట్ల నివాసం వద్ద అభిమానుల సందడి

విజయనగరం రూరల్: విజయనగరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కోలగట్ల వీరభద్రస్వామి శనివారం నామినేషన్ వేశారు. ఉదయానికే పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో కోలగట్ల నివాసానికి చేరుకున్నారు. అక్కడ నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఆర్‌ఓ కొల్లాబత్తుల కార్తీక్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. కోలగట్ల వీరభద్రస్వామి అభ్యర్థిత్వాన్ని ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్, కార్పొరేషన్ మేయర్ వి.విజయలక్ష్మి బలపరిచారు. రెండో నామినేషన్ సెట్‌ను కోలగట్ల వీరభద్రస్వామి సతీమణి కోలగట్ల వెంకటరమణి రిటర్నింగ్ అధికారికి అందజేశారు. కార్యక్రమానికి ముందుగా కోలగట్ల వీరభద్రస్వామి కొద్దిమంది నాయకులతో పైడితల్లి అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆనవాయితీ ప్రకారం పెద్దచెరువు సమీపంలోని కోట సత్తెమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రజా సేవా మా అభిమతం

నామినేషన్ ప్రక్రియ అనంతరం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్లలో నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజాసేవకే అంకితమయ్యామని తెలిపారు. చేసిన అభివృద్ధిని చూసే ఓటేయ్యాలని ప్రజలను ధైర్యంగా అడుగుతున్న సత్తా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకే ఉందన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్యను శతశాతం పరిష్కరించామని.. 70 శాతానికి పైగా రోడ్లు బాగు చేశామన్నారు. నగర సుందరీకరణ, పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనతో విజయనగరం రూపురేఖలు మార్చామని తెలిపారు. మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సహకారంతో జిల్లా కేంద్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడాన్ని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. నిస్వార్థంగా సేవ చేశాము కాబట్టే కరోనా అనంతరం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 48 డివిజన్లు కట్టబెట్టారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తమ రెండు ఓట్లను ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గుర్తు ఫ్యాన్‌పై వేసి గెలిపించాలని కోరారు.



నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

కార్పొరేషన్ స్థాయి కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీదే

విజయనగరం మున్సిపాలిటీని కార్పొరేషన్ స్థాయికి తీసుకెళ్లిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని ఆ పార్టీ ఉత్తరాంధ్ర డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తే.. విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల నియోజకవర్గం రూపురేఖలే మార్చి అభివృద్ధిలో ముందంజలో నిలిపారన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా నియోజకవర్గంలో 15 వేల మంది పేదలకు ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేయించిన ఘనత కోలగట్ల వీరభద్రస్వామికి దక్కుతుందన్నారు. గతంలో పెద్ద పదవులు అనుభవించిన నాయకులు కరోనా సమయంలో తమ ప్రాణాలు పోతాయని గేట్లు మూసుకుని ఇంట్లో కూర్చుంటే.. కోలగట్ల వీరభద్రస్వామి మాత్రం ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేశారన్నారు.

అభివృద్ధి, సంక్షేమం చూసి ఓట్లేయండి

నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమం చూసి ప్రజలు ఓట్లేయాలని విజయనగరం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంకల్పం, మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కోలగట్ల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన తప్పనిసరి

- ఫైర్ సేఫ్టీ డీఎస్పీ విశ్వనాథం

విజయనగరం క్రైమ్: అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఫైర్ సేఫ్టీ డీఎస్పీ విశ్వనాథం అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగులు, కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్ స్టేషన్‌లో ఉండే వివిధ పరికారాల పనితీరు.. వాటి ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ బి. అప్పలరాజు, డాక్టర్ వెంకటేశ్వరరావు, డీఈఆర్‌ఎఫ్‌ఓ బీవీఎస్. రాంప్రకాష్, ఏడీఎఫ్‌ఓ సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫైర్ సేఫ్టీ డీఎస్పీ విశ్వనాథం

మూడోరోజు ఒక నామినేషన్

నెల్లిమర్ల: నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మూడో రోజైన శనివారం ఒక అభ్యర్థి నామినేషన్ దాఖలు చేశారు.ఇండిపెండెంట్ అభ్యర్థిగా కోలా వర్షిణి నామినేషన్ సమర్పించారు. ఈమె జనసేన అభ్యర్థి లోకం నాగమాధవి కోడలు. ఇంతవరకు నెల్లిమర్ల నియోజకవర్గానికి సంబంధించి ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం. నూకరాజు తెలిపారు.

మూడో రోజు మూడు నామినేషన్లు..

విజయనగరం రూరల్: విజయనగరం అసెంబ్లీ స్థానానికి మూడో రోజు మూడు నామినేషన్లు దాఖలయ్యాయని ఆర్‌ఓ కె.కార్తీక్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నుంచి కోలగట్లవీరభద్రస్వామి, ఆయన సతీమణి కోలగట్లరమణి రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా , స్వతంత్ర అభ్యర్థిగా రుద్రప్రగడ గురునాథ్‌శర్మ మరో నామినేషన్ దాఖలు చేశారన్నారు.

నేడు ప్రవేశ పరీక్ష

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో చేరేందుకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పరీక్షకు హాజరుకావాలని కోరారు.